క్లుప్తంగా

30న వాహనాల వేలం

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఎస్ఈబీ (ఎక్సైజ్) ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో హెచ్చుపాటదారుడికి వాహనం దక్కించుకుంటారన్నారు. మొత్తం 12 ద్విచక్రవాహనాలను వేలంకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలకు అవార్డు

సంబేపల్లె : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం ప్రకటించిన స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు జిల్లా స్థాయిలో 3వ స్థానం సాధించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొని బహుమతులను సాధించారన్నారు. అనేక ఆటలు, క్రీడల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ పురస్కారం దక్కిందని తెలియజేశారు. అనంతరం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషాను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

అర్జీదారులకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న అర్జీదారులు

రాయచోటి టౌన్ : అన్ని దానాల కన్నా అన్నదానం చాలా గొప్పదని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం అర్జీదారులకు ఉచితంగా భోజనం అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సోమవారంతో ఉచిత అన్నదానం 34వ వారానికి చేరుకోగా, వైఎస్సార్‌సీపీ మదనపల్లె పరిశీలకుడు హబీబ్‌ఖాన్ ఆర్థిక సహకారంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో మారం లోకనాథ్‌రెడ్డి, మారం రెడ్డికుమారి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా సోమవారం మండల పరిధిలోని బండపల్లె వద్ద గల ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ కోశాధికారి హరీష్ చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ సుబ్బయ్య, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లను ఆదుకోండి

పెనగలూరు : ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని ఎండీయూ సంఘం మండల అధ్యక్షుడు సిద్దవరం సుబ్బరాయుడు తెలిపారు. రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు మండలంలోని ఎండీయూ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవచేస్తూ మరణించిన ఎండీయూ ఆపరేటర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే ఆపరేటర్లు అందరికీ ప్రమాద బీమా ప్రకటించాలన్నారు. హెల్పర్లకు ప్రస్తుతం రూ. 9 వేలు వరకు జీతం ఇస్తున్నామని వారన్నారు. జగనన్న గోరు ముద్ద, అంగన్‌వాడీ కేంద్రాలకు వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నందుకు ఇస్తున్న రూ. 10లు సరిపోవడం లేదని, డీలర్లకు ఇచ్చినట్టు తమకూ కమీషన్‌ను ఇవ్వాలని కోరారు. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు.


ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు



ఎన్‌బీఏ పత్రాన్ని చూపుతున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి అన్నారు. సోమవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేటేషన్ గుర్తింపు లభించిందన్నారు. అందుకు సంబంధించిన పత్రాన్ని ప్రిన్సిపాల్ స్వర్ణలతకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌బీఏ గుర్తింపు నాలుగవసారి వచ్చిందన్నారు. ఫార్మసీ విద్యకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతోందన్నారు. దేశ, విదేశాలలో ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఫార్మసీ అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి సోమవారం పల్లకీలో ఊరేగారు. ప్రతి సోమవారం రాత్రి స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. పల్లకీ సేవలో ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివిరమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం

- సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత
- గడప గడపకు మన ప్రభుత్వంలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



గాలివీడు: గిరిజన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



చిన్నమండెం: పూజలనంతరం ఆలయంలో నాయకులతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి పూలుకుంట సచివాలయం పరిధిలోని బోరెడ్డిగారి పల్లె పంచాయతీ సుగాలితాండా, బోరెడ్డిగారిపల్లె, గొందిపల్లె, బక్కిరెడ్డిగారిఇళ్లల్లో ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, మండల అధికారులతో గడప గడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తూ ప్రభుత్వం నుంచి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు వింటూ పరిష్కరిస్తూ..

బోరెడ్డిగారిపల్లె గ్రామ పరిధిలోని పల్లెల్లో నెలకొన్న సమస్యలను వింటూ అక్కడిక్కడే అధికారులు, నాయకులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల మన్నలను పొందారు. గడప గడప కార్యక్రమానికి వస్తున్న ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, నాయకులు సూచించారు.

మాటల్లో కాదు.. చేతల్లోనూ అభివృద్ధి

జగనన్న ప్రభుత్వం మాటల్లో కాదని చేతల్లో అభివృద్ధి, సంక్షేమం చూపిస్తూ పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు అభివృద్ధిలో ప్రభుత్వం ముందడుగులో ఉందన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని, గ్రామాల్లో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే సానుకూలంగా సమస్యలను పరిష్కరించుకుందామని తెలిపారు. అంతకుముందు గ్రామ సర్పంచ్ నారాయణ సుధాకర్, ఎంపీటీసీ చంద్రప్రకాష్‌రెడ్డి, ఉప సర్పంచ్ మన్సూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమానికి విచ్చేసిన శ్రీకాంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.రమేష్‌రెడ్డి, గుమ్మా అమర్‌నాథరెడ్డి, ఎంపీటీసీలు గడ్డం చంద్రప్రకాష్‌రెడ్డి, తమటం చిన్నరెడ్డి, కడప అమానుల్లా, సర్పంచ్‌లు ఉమాపతిరెడ్డి, చెన్నకేశరెడ్డి, గుమ్మా ప్రభాకర్, రామాంజులురెడ్డి, ఉప సర్పంచ్ మన్సూర్, మండలాధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఆలయాలకు మహర్దశ

చిన్నమండెం : జగన్ పాలనలో ఆలయాలకు మహర్దశ సంతరించుకుందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లూరు పంచాయతీ కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట పూజలలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలకు జిల్లా దేవాదాయ శాఖాధికారి విశ్వనాథ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం పూజాది కార్యక్రమాలు చేసి తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రూ. 50 లక్షలతో కొత్తపల్లె కోదండ రామాలయం నిర్మాణాలు పూర్తి కాబడి విగ్రహ ప్రతిష్ట కావడం రూ. 44 లక్షల నిధులతో కల్యాణ మండపం పూర్తి కావస్తుండటం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో చిన్నారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ అంజలి, లక్ష్మీరెడ్డి, ఎంపీఈసీ శ్యామ్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మాజీ సర్పంచ్ చక్రపాణిరెడ్డి, సర్పంచ్ ముసల్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటప్పనాయుడు, రమేష్, నాయకులు చంద్రారెడ్డి, సురేంద్రారెడ్డి, చుక్కా అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామాపురం మండలంలో..

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో ఈనెల 30, 31 తేదీలలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జన విజ్ఞాన వేదికకు జిల్లా నూతన కార్యవర్గం

రాయచోటి అర్బన్ : జన విజ్ఞాన వేదిక అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో జరిగిన జేవీవీ 2వ జిల్లా మహాసభలో కమిటీని ఎంపిక చేశారు. జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా హరీంద్రనాథశర్మ, రెడ్డెన్న, హరినాథరెడ్డిలు, గౌరవ సలహాదారుగా వై.సి.రెడ్డెప్పరెడ్డి, జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ప్రభుచరణ్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్‌రెడ్డి, కోశాధికారిగా రామయ్య, ఉపాధ్యక్షులుగా కరుణాకర్, రౌఫ్‌బాషా, రవీంద్రనాథరెడ్డి, జయచంద్ర, ప్రతాప్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలు, కార్యదర్శులుగా రాజయ్య, నరసింహులు, ఇమాం బాషా, చంద్రమనోహర్‌లు ఎంపికయ్యారన్నారు. ఇక ఆరోగ్య విభాగం కన్వీనర్‌గా డాక్టర్ రెడ్డి కీర్తి, విద్యాకమిటీ కన్వీనర్‌లుగా శ్రీదేవి, పద్మావతి, సమతా కమిటీ కన్వీనర్‌గా కళావతి, శాస్త్ర, సాంకేతిక విభాగం కన్వీనర్‌గా రాజశేఖర్, యూత్ కన్వీనర్‌గా వినయ్, హరిప్రసాద్, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా నాగేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్‌గా చాన్‌బాషా, చెకుముకి కన్వీనర్‌గా ఆంజనేయులు, ఓబుల్‌రెడ్డిలు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

దుకాణంలో చోరీ

ఒంటిమిట్ట: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ఉన్న వ్యవసాయ బోరు మెకానిక్ అంగడిలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుల వివరాల మేరకు.. ఒంటిమిట్టలో శేఖర్ బోరు మెకానిక్ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి పైన ఉన్న రేకులను తొలగించి కొంతమంది దుండగులు లోనికి చొరబడి అక్కడ ఉన్న రూ. 3 లక్షల నగదును చోరీ చేసినట్లు యజమాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడే. ఈ విషయమై పోలీసులు విచారిస్తున్నారు.

అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ సంసిద్ధత



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న స్టేషన్ ప్రాంతవాసులు

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్‌యూబీకి సంబంధించి అప్రోచ్‌రోడ్డు నిర్మితానికి ఆర్‌అండ్‌బీ సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు ఆర్డీఓ రామకృష్ణారెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో స్టేషన్ ఏరియా నివాసీయులు చిట్వేలి రవికుమార్, వెంకటసుబ్బయ్య, యల్లయ్య, సీహెచ్‌రాజు, లక్ష్మీకర్‌లు ఆర్డీఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రాజంపేట మున్సిపాలిటీ గుర్తించి ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ అధికారులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. భూసేకరణకు సంబంధించి పలువురు స్థానికులు సమర్పించిన మరో వినతిపత్రాన్ని పరిశీలన నిమిత్తం మున్సిపల్ కమిషనర్‌కు పంపామన్నారు. ప్రక్రియ పూర్తి కాగానే ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వారికి తెలియజేశారు. దీంతో రైల్వేస్టేషన్ ఏరియా వాసులు తమ సంతోషాన్ని ఆర్డీఓ ఎదుట వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి

పెనగలూరు : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వద్దకు పలువురు రైతులు తమ అర్జీలను సమర్పించి సమస్యలు విన్నవించారు. అనంతరం విజయ్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏవైనా పొలాలకు సంబంధించి మ్యూటేషన్ పెట్టుకున్నా, ఆన్‌లైన్ కోసం కార్యాలయానికి వస్తున్నా ఆలస్యం చేయకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. పలు సమస్యలపై ఆయన చర్చించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వరప్రసాద్‌తో కలిసి సిబ్బందితో సమావేశమయ్యారు. అక్కడ సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బీడు భూములు సాగులోకి



బీడు భూములను సాగులోకి తీసుకునే విధానాన్ని తెలియజేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చిన్నమండెం : బీడు భూములను సాగులోకి తీసుకురావడానికి రైతాంగం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్ తెలిపారు. సోమవారం మండల పరిధిలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో బీడు భూములను సాగులోకి తీసుకువచ్చే కార్యక్రమాన్ని ప్రకృతి వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడు భూముల్ని సాగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 3/3 ప్లాన్‌తో మొక్కల జీవవైవిధ్యం కలుగజేసే ప్రయోగం వల్ల 365 రోజులు కప్పి ఉంచవచ్చన్నారు. ఈ విధానం ద్వారా వర్షాలు లేని సమయంలో మనం వేసిన ఘనజీవామృతం ప్రక్రియ వల్ల గాల్లో తేమను తీసుకొని మొక్క జీవం పొసుకుని బతుకుతుందన్నారు. ఈ ప్రక్రియను రైతులందరూ గమనించి వారివారి బీడు భూముల్లో తక్కువ పెట్టుబడితో ఈ పంటలను పండించే విధానాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, ఎస్ఎఫ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేద దళితులకు భూ పట్టాలివ్వండి



ఓబులవారిపల్లె: నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : బాలిరెడ్డిపల్లె గ్రామంలోని పేద ఎస్సీ, ఎస్టీ దళిత కుటుంబాలకు ప్రభుత్వం భూ పంపిణీ చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 1155లో దాదాపు 120 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉందన్నారు. భూమిలేని దళిత కుటుంబాలకు వెంటనే భూములు కేటాయించాలని ఉదయం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం, దళితులు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలియజేయడంతో వారు నిరసనను విరమించారు. కార్యక్రమంలో సీపీఐ అన్నమయ్య జిల్లా నేత పీఎల్ నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జయరాం, సీపీఐ నియోజవర్గ, మండల కార్యదర్శులు జ్యోతి చిన్నయ్య, చింతపూడి నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాలివ్వండి

చిట్వేలి : ప్రభుత్వ భూములలో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దూరు గిరిజనులు అనేక సంవత్సరాలుగా ఆ భూములలో వర్షాధార పంటలను సాగుచేసుకుంటున్నారన్నారు. గిరిజనుల అనుభవంలో ఉన్న భూములకు ఇంత వరకు పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా వారికి పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సుమనికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొత్త నాని, శివయ్య, మల్లికార్జున, నందు, నరసింహులు, గురవయ్య, నాగరాణి, పార్వతి, కన్నెమ్మ, రాజమ్మ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్‌లో యాంటీనా పాత్రపై అవగాహన

రాజంపేట : చంద్రయాన్ విజయవంతంలో యాంటీనా పాత్రపై సోమవారం ఏఐటీఎస్‌లో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో యాంటీనా డిజైన్ ఫ్యాబ్రికేషన్ అండ్ లింక్ డెప్లాయ్‌మెంట్ అనే అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. పూణెకు చెందిన యాంటీనా ఇంజనీర్స్ మూంబ్స్ ల్యాబరేటరీ అనిరుద్ కులకర్ణి, బోపాలే సదస్సులో పాల్గొని యాంటీనా బేసిక్స్ అవగాహన కల్పించారు. ల్యాబరేటరీలో తీసుకెళ్లి యాంటీనాలు గురించి ప్రత్యక్షంగా ప్రయోగాలు చేశారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా.ఎస్ఎంవీ నారాయణ, ఏఓ నుకా సుబ్బారెడ్డి, ఈసీఈ హెచ్ఓడీ నాగరాజు, కె.ప్రసాద్, డా.వెంకటదాసు, ఫయాజ్‌బేగం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

పుల్లంపేట : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపీ మోడల్ స్కూల్, కేజీబీఎస్ కస్తూర్బా గాంధీ పాఠశాల, ఎస్సీ బాలికలు, బీసీ బాలుర వసతి గృహాలలో సోమవారం డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో డీటీటీ మందును పిచికారీ చేశారు. రాబోయే వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా ముందుజాగ్రత్త చర్యగా స్ప్రే నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు సోకకుండా, దోమ పుట్టకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ స్వామిదాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు లవకుమార్

రైల్వేకోడూరు అర్బన్ : ఈ నెల 26, 27 తేదీలలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి 39వ తైక్వాండో పోటీలలో రైల్వేకోడూరుకు చెందిన నాగిశెట్టి లవకుమార్ మొదటి బహుమతి బంగారు పథకాన్ని సాధించి వచ్చే నెల అస్సాంలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్టు సోమవారం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్, సెక్రటరీ చంద్రమౌలిలు తెలిపారు. ఆర్ఎస్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు హస్తి రవిశంకర్‌రాజు మాట్లాడుతూ లవకుమార్‌కు మంచి భవిష్యత్ ఉందని జాతీయస్థాయిలో బంగారు పతకం సాధిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.

అంగన్‌వాడీ కేంద్రానికి గ్యాస్ స్టవ్ వితరణ

వీరబల్లె (రాయచోటి టౌన్): మండల పరిధిలోని తాటిగుంటపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి అదే గ్రామ సర్పంచ్ గోపీనాథ్‌రెడ్డి గ్యాస్ స్టవ్ వితరణ చేశారు. సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తకు స్టవ్‌ను అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గ్యాస్ స్టవ్ లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని సెంటర్‌కు అందజేసినట్టు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



పుల్లంపేట : మండల పరిధిలోని ఎగువరెడ్డిపల్లి, టి.కమ్మపల్లె, రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల రావు సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లోని వంట గదులను వారు పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని వడ్డించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సమస్యలపై విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకుని వాటి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



వరి పంటను పరిశీలిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ జాన్సన్, డాక్టర్ శ్రీవల్లి

సిద్దవటం : మండలంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లె గ్రామాల్లోని వరి పంట పొలాలను సోమవారం ఊటుకూరు శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్‌కుమార్ (కీటక నిపుణులు), డాక్టర్ జాన్సన్ (తెగుళ్ల నిపుణులు), డాక్టర్ శ్రీవల్లి (బ్రీడర్), బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ, స్థానిక మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డిలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఊటుకూరు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి పంట పిలకలు, కరుకు దశలో ఉందన్నారు. బిపిటి 5204, కెఎన్ఎం-1638 రకాలు సాగు చేశారన్నారు. వర్షాభావం, బెట్ట పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నెలకొన్న ఈ పరిస్థితిలో నీరు బాగా పెట్టాలన్నారు. పొలాలు నెర్రెలు లేకుండా చూసుకోవాలన్నారు. వరి పంటలో ఆకునల్లి ఉధృతి ఎక్కువగా ఉందని, దీంతో పత్రహరితం తక్కువై ఆకులు ఎర్రగా మారుతున్నాయన్నారు. దీని నివారణ కోసం ప్రొఫెనోఫోస్ 2 మిల్లీలీటర్లు, ఒక లీటరు నీటికి లేదా ఓమైట్ ప్రోపరగైట్ 2 మిల్లీ లీటర్లు లేదా ఒబెరాన్ 1 మిల్లీ లీటరుకు 1 లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎండు తెగులు నివారణకు నత్రజని ఎరువులు వాడకాన్ని వాయిదా వేయడం, పొటాష్ ఎరువును ఎకరాకు కనీసం 25–30 కిలోలు వేసుకోవాలన్నారు. పొటాష్ లోపం సవరణకు పొటాష్ ఎరువుల వాడకం, లేదా 19:19:19 10 గ్రాములు 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పంటలో కాండం తొలుచు పురుగును గమనించామన్నారు. చౌడు భూమి లక్షణాలు కూడా ఉన్నాయని పూర్తి వివరాలకు రైతులు ఎప్పటికప్పుడు రైతు భరోసా కేంద్ర సహాయకులు, మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం ఆర్బీకేల్లో యూరియా ఎరువులు నిల్వలను పరిశీలించారు. సాలిగాండ్ల పుల్లయ్య, బూసి క్రిష్టారెడ్డి అనే రైతులకు యూరియాను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు మేకల ప్రేమ్‌కుమార్, రైతులు భవనాశి వెంకటసుబ్బయ్య, సిద్దవటం నారాయణరెడ్డి, బూసి గంగాధర్‌రెడ్డి బండి నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో రోగులకు ఉచిత ఆహారం



రోగికి ఆహారం అందజేస్తున్న నాయకులు, వైద్యుడు

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంలోని పెద్దాసుపత్రిలో ఎట్టకేలకు రోగులకు ఉచిత ఆహార పంపిణీని ఏడాది తర్వాత పునఃప్రారంభించారు. సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పీవీఎస్‌రాజు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఉమామహేశ్వర్‌రెడ్డి, వడ్డే శ్రీనులు రోగులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలపాటు ఉచిత డైట్‌ను రోగులకు అందించేలా కాంట్రాక్టర్ వీరభద్రతో ఒప్పందం కుదిరిందన్నారు. రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామన్నారు. వైస్‌చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆ దిశగా పేద రోగులకు కార్పొరేట్ వైద్యం అందజేస్తున్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ వైద్యుడు డా.సానే శేఖర్, వైద్య విధాన పరిషత్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి



భాషోద్యమకారుల చిత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : వ్యవహారిక భాష రూపకర్త గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగుపండితులు గంగనపల్లె వెంకటరమణ ఆధ్వర్యంలో కవులు, రచయితల చిత్రపటాలను ఆవిష్కరించారు. సోమవారం హెచ్ఎం జయలలితకుమారి, ఎంఈఓ నాగన్న, సర్పంచ్ సూర్యనారాయణలు విడుదల చేశారు. గీత, రమణమ్మ, విజయకుమారి, ప్రమీల రాహేల్, ఆనందాచారి, సుబ్బరాయుడు, డా.నాగేంద్రప్రసాద్, బోగా వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, రవిశంకర్‌రెడ్డి, మస్తాన్, రమణ, ప్రసాద్, స్వర్ణలత, జ్యోతిప్రియ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్త్వం అలవర్చుకోవాలి

విద్యార్థులు పోటీతత్త్వం అలవర్చుకోవాలని నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఎంఈఓ నాగయ్య, హెచ్ఎం జయలలితాకుమారిలు అన్నారు. సోమవారం నాగిరెడ్డిపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్‌లో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు డేవిడ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. గోపి, ఆకేపాటి రమేష్‌రెడ్డి, తుమ్మాది శివ, పొంబల శివనరసింహులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలి



ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలంటూ నిరసన ప్రదర్శన చేస్తున్న బీడీ కార్మికులు

రాయచోటి అర్బన్ : జిల్లా కేంద్రమైన రాయచోటిలో వెంటనే 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి డి.భాగ్యలక్ష్మిలు డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావాలంటూ సోమవారం పట్టణానికి చెందిన బీడీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ కార్మికుల కోసం ప్రస్తుతం రాయచోటిలో నిర్వహిస్తున్న వైద్యశాలలో తగినంత మంది వైద్యసిబ్బంది లేరన్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన డిస్పెన్సరీ డాక్టర్ వారంలో రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటారని, మిగిలిన రోజుల్లో రోగుల పరిస్థితి ప్రశ్నార్థకంగా తయారైందన్నారు. రాయచోటి డిస్పెన్సరీలో వెంటనే వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. బీడీ కార్మికుల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రామచంద్ర, కార్మికులు మెహతాజ్, ముబీనా, ఖదీరూన్, అన్సారీ, రమీజా, గంగమ్మ, షర్మీల తదితరులు పాల్గొన్నారు.

దప్పేపల్లె భూ ఆక్రమాలపై చర్యలు తీసుకోండి

లక్కిరెడ్డిపల్లె మండలం దప్పేపల్లె గ్రామ పరిధిలో చోటుచేసుకున్న భూ ఆక్రమణలపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాయచోటి ఏరియా కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలుసుకుని మాట్లాడారు. దప్పేపల్లె గ్రామ పరిధిలో అసైన్డ్ ల్యాండ్ భూ పంపిణీ జాబితాలో అనేక అక్రమాలు జరిగాయన్నారు. గ్రామంలో లేని వ్యక్తుల పేర్లతో భూ పంపిణీకి అధికారులు జాబితాను సిద్ధం చేశారన్నారు. వెంటనే భూ పంపిణీ జాబితాపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

తాగునీటి బోరును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

గ్రామ తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోరును ఆక్రమించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సుండుపల్లె మండలం మడితాడు గ్రామ ప్రజలు, మాతమ్మ హరిజనవాడ వాసులు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. నిరసన ప్రదర్శనకు సీపీఎం నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ మడితాడు హరిజనవాడవాసుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేయించిన బోరును గ్రామానికే చెందిన సుబ్బయ్య ఆక్రమించుకున్నాడన్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతూ, నోటికొచ్చినట్లుగా దూషిస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వ తాగునీటి బోరును ఆక్రమించుకున్న సుబ్బయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేసి దళితవాడ వాసులకు తాగునీరందేలా చూడాలన్నారు.